

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్
మహిళల ఒంటిపై ఆభరణాలు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువుల దొంగతనాలకు పాల్పడే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



సందిగ్ధంలో 'మూసీ' రైతులు
నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోవడంతో మూసీ ఆయకట్టులో వానాకాలం సాగుపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. - 10లో

గరిష్టం / కనిష్టం
29 / 25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: నకిలీ స్టాక్ మార్కెట్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి ప్రజలు మోసపోవద్దని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక రాబడుల వాగ్దానాలతో మోసగాళ్లు సోషల్ మీడియా ద్వారా బాధితులను ఆకర్షిస్తున్నారని, జెఫరీస్ ఎంటర్‌ప్రైస్, సాక్షిసింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్‌ల ద్వారా ఎవరైన డబ్బులు వేయమని మెసేజ్‌లు పంపితే వేయవద్దని పేర్కొన్నారు. మోసపూరిత నకిలీ స్టాక్ మార్కెట్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మోసంపై ఒక బాధితుడు ఫిర్యాదు చేయగా కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని తెలిపారు. ఫిర్యాదు చేసిన బాధితుడు రూ.11 లక్షలు వరకు పెట్టుబడి పెట్టి మోసపోయాడని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు వెంటనే ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నిరంకుశ వైఖరికి, ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా పనిచేయని వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కేఎస్.రెడ్డి, పబ్బు వీరస్వామి, లెనిన్, సత్యనారాయణ, పండరి మదర్, రామకోటి, సుజాత, కౌసల్య, జ్యోతి, యాదయ్య, లెనిన్ పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగే పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేస్తున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయ డీపీఆర్‌ఓ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నల్లగొండలో అందుబాటులో లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా పోలీస్ గ్రీవెన్స్ డేకు రావొద్దని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



పూసలపాడులో తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి అనంతరెడ్డి

వేములపల్లి (మాడ్గులపల్లి): రైతులు ఆయిల్ పామ్ తోటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండలం పూసలపాడులో మెగాయిల్ పామ్ డ్రైవర్ కార్యక్రమంలో భాగంగా రైతులు జొన్నలగడ్డ రఘునాథరెడ్డి, బత్తుల చిన్న వెంకటయ్య వ్యవసాయ క్షేత్రాల్లో ఆరు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. ఇప్పటివరకు మాడ్గులపల్లి మండలంలో 204 ఎకరాల్ల ఆయిల్ పామ్ తోటలు సాగు చేశారని, ఈ సంవత్సరం వెయ్యి ఎకరాల్లో మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొక్కలకు డ్రిప్ రాయితీ అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, కోటేష్, బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధికి అడుగులు



నల్లగొండలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

- నీలగిరి, మిర్యాలగూడ డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- దుర్వాసన వస్తోందంటున్న సమీప గ్రామాల ప్రజలు
- బయోమైనింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- తద్వారా కంపోస్టు ఎరువు, విద్యుత్ ఉత్పత్తి
- త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు

నల్లగొండ టూటౌన్: నీలగిరి, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను శుద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వేల మెట్రిక్ టన్నుల్లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో సమీప గ్రామాల ప్రజలకు దుర్వాసన వస్తుందనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణం దెబ్బతినకుండా బయోమైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగా జిల్లాలో నీలగిరి, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో బయోమైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వాటిల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయనున్నారు. తడి చెత్తను వర్మికంపోస్ట్ ఎరువుగా, పొడి చెత్తను కరెంట్ తయారు చేసి సిమెంట్ కంపెనీలకు విక్రయించనున్నారు.

పేరుకుపోయిన 2.40 లక్షల టన్నుల చెత్త

నీలగిరి, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో రాంకీ సంస్థ వారు డ్రోన్ సర్వే చేసి చెత్త ఎంత ఉందనే లెక్కతేల్చారు. నీలగిరిలో 1.40 లక్షల టన్నులు, మిర్యాలగూడలో లక్ష టన్నులు కలిపి మొత్తంగా రెండు పట్టణాల్లో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉందని గుర్తించారు. రోజూ నీలగిరి పట్టణంలో 100, మిర్యాలగూడ పట్టణంలో 60 మెట్రిక్ టన్నుల చెత్తను ఆయా మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డులకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. వీటిల్లో తడి చెత్తను మాత్రమే వర్మి కంపోస్ట్ ఎరువుగా కొంత మేర తయారు చేస్తుండగా, పొడి చెత్త అంతా కుప్పలుగా పేరుకుపోయిందని సదరు వివరాలను సంబంధిత మున్సిపాలిటీల అధికారులు ప్రభుత్వానికి పంపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతోనే ఇటీవల రాంకీ సంస్థ డ్రోన్ సర్వే ఆధారంగానే చెత్త లెక్క తేల్చింది. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

రెండు మున్సిపాలిటీల వివరాలు

అంశం	నీలగిరి	మిర్యాలగూడ
వార్డులు	48	48
జనాభా	2.60 లక్షలు	1.33లక్షలు
గృహాలు	34 వేలు	27,500
రోజూ చెత్త సేకరణ	96.40 మెట్రిక్ టన్నులు	60
ఎరువు తయారీ	5.10 మెట్రిక్ టన్నులు	03
యార్డులో ఉన్న చెత్త	1.40లక్షల మెట్రిక్ టన్నులు	లక్ష (మె.ట.)

బయోమైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం

డంపింగ్ యార్డుల్లో బయోప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా చెత్త కుప్పలను వేరు చేసి ఎరువు, కరెంట్ తయారు చేస్తారు. రాష్ట్ర స్థాయిలో టెండర్లు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. తదుపరి నీలగిరి, మిర్యాలగూడలో బయోమైనింగ్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

ఇకనుంచి రోజు వారీగానే..

మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను శుద్ధిచేసిన తర్వాత మరో 20 ఇళ్ల వరకు స్థలం కొరత ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. ఇకనుంచి ఏ రోజు వచ్చే చెత్తను అదేరోజు లేదా మరుసటి రోజే శుద్ధిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మున్సిపల్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. లక్ష టన్నుల వరకు చెత్త కుప్పలు పేరుకుపోయి ఇబ్బందులు వచ్చే దాకా చూడకుండా ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా..

- అమ్మ మాట-అంగన్‌వాడీ బాట పేరుతో కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- రెండున్నరేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీలకు రప్పించడమే లక్ష్యం
- నేటి నుంచి వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్



మిర్యాలగూడ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం తింటున్న చిన్నారులు

మిర్యాలగూడ టౌన్: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలమని, పాఠశాలల్లో చేరేనాటికి అక్షరాలు, అంకెలు నేర్పి, ఆటాపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు సోమవారం నుంచి వారం రోజుల పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. దీంట్లో భాగంగా ఈనెల 20న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారానే అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు ఉచితంగా యూనిఫాం కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	09
అంగన్‌వాడీ కేంద్రాలు	2,093
0 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు	67,415
గర్భిణులు	7,009
బాలింతలు	10,245

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- ఈనెల 15, 16 తేదీల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్వయం సహాయ సంఘాలు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువత, ఎన్‌జీవోస్, తల్లిదండ్రులు గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు నిర్వహిస్తారు.
- 17న రెండున్నరేళ్ల వయస్సు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో చేర్పిస్తారు. పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను కూడా గుర్తించి, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు.
- 18న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించాలి. పూర్వ ప్రాథమిక విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన పద్ధతులు, పాఠశాల విద్యకు సమాయత్తం చేసే అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.
- 19న స్వచ్ఛ అంగన్‌వాడీ పేరుతో కేంద్రాలను శుభ్రంగా తీర్చిదిద్దుతారు. వాటి చుట్టూ మొక్కలను నాటుతారు. కిచెన్ గార్డెన్, తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయాలు ఉండేలా చర్యలు చేపడతారు.
- 20న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే, సాముహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాతలు, నానమ్మలు, బామ్మలను ముఖ్య అతిథులుగా పిలిచి పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తారు. కేంద్రాలకు సరఫరా అయినా బోధన, ఆటవస్తువులను ప్రదర్శించి చూపిస్తారు.

కార్యక్రమం విజయవంతానికి సహకరించాలి

ప్రభుత్వం ఆదేశాల మేరకు వారం రోజుల పాటు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేసి ఆటాపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలి.

– సక్కుబాయి, ఐసీడీఎస్ పీడీ నల్లగొండ

నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

నల్లగొండ టూటౌన్: బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మోర్చాల బాధ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

29 మండలాల్లో వర్షం

నల్లగొండ టౌన్: జిల్లాలో 29 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా సరాసరి 2.11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందూరు మండలంలో 8.9మిల్లీమీటర్ల వర్షం కురవగా అత్యల్పంగా గుండ్లపల్లి(డిండి) మండలంలో 0.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే కనగల్ మండలంలో 7.7మిల్లీమీటర్లు, మర్రిగూడ 7.5, గట్టుప్పల్ 4.3, కేతేపల్లి 4.1, గుర్రంపోడు 3.9, అనుముల 3.5, నాంపల్లి 3.3, చింతపల్లి 2.8, దామరచర్ల 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో 18 మండలాల్లో 1.7 మిల్లీమీటర్ల నుంచి 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆషాఢ బోనం



నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడలో ఆదివారం ఆషాఢ మాసం బోనాల మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపులో పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి



సుఖేందర్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

- శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ప్రభుత్వ ఆర్థికసాయం కోసం దరఖాస్తులు చేసుకున్న 43 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.11,71,500 విలువ గల చెక్కులను ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ సహాయనిధి నుంచి లక్షలాది మంది నిరుపేదలకు ఉపయోగ పడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చెక్కులను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసి పేదలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్‌సుందర్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, యాదగిరి, మునాస వెంకన్న, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తాను కలిసిన ఎస్పీ

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తాకు మొక్కను అందజేశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పు రావాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నకిరేకల్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు విద్య నిలబడాలంటే విద్యావ్యవస్థలో మార్పు రావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం నకిరేకల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలు అవుతున్నా ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో లోపభూయిష్ట నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ బడుల్లో 20 ఏళ్ల నుంచి విద్యార్థులు సంఖ్య తగ్గిపోతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న పరిస్థితులకు పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలలే కారణమని ఆరోపించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, నాయకులు కందాల ప్రమీల, రాచకొండ వెంకన్న, కావ్య, లక్ష్మణ్, సైదానాయక్, రవీందర్, రమేష్, వెంకటేష్, జగన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

34 మంది బాలకార్మికులకు విముక్తి

కొనసాగుతున్న 'ఆపరేషన్ ముస్కాన్'

- వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న బాలలను గుర్తిస్తున్న అధికారులు
- మూడు శాఖల ఆధ్వర్యంలో ముమ్మర గాలింపు
- 26 మంది యజమానులపై కేసులు నమోదు



నల్లగొండలో బైక్ మెకానిక్ షాపులో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించిన అధికారులు

నల్లగొండ: వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించి బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 2015 నుంచి ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఆపరేషన్ స్మైల్–10 పూర్తికాగా ఈ నెల 1వ తేదీ నుంచి ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతోంది. బాలల పరిరక్షణ విభాగం, కార్మిక, పోలీస్ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ఇటుక బట్టీలు, బైక్ మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో బాల కార్మికులుగా పనిచేస్తున్న 34 మంది బాల కార్మికులను గుర్తించి పనుల నుంచి విముక్తి కల్పించారు. ఇందులో 33 మంది బాలురు కాగా, ఒక బాలిక ఉన్నారు. వీరిలో మన రాష్ట్రంతోపాటు బిహార్, ఛతీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. వీరందరినీ వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కొన్ని చోట్ల బాల కార్మికులను గుర్తించిన అధికారులు ఆయా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలల్లోనూ చేర్పిస్తున్నారు.

బాలలను పనుల్లో పెట్టుకోవద్దని హెచ్చరిస్తున్నా..

14 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన బాలబాలికలను వివిధ పనుల్లో పెట్టుకోవద్దని ప్రభుత్వం బాలల పరిరక్షణ విభాగంగా వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది. బాలలను పనిలో పెట్టుకోవద్దని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేస్తూ వస్తున్నారు. అయినప్పటికీ కొందరు యజమానులు మాత్రం మారకుండా బాలలతో పనులు చేయిస్తూనే ఉన్నారు. ఈనెల 1నుంచి చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా బాలలను పనిలో పెట్టుకున్న 26 మంది యజమానులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

యాదాద్రి క్షేత్రంలో కోలాహలం



ప్రధానాలయం మాడ వీధుల్లో కిక్కిరిసిన భక్తజనం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం కోలాహలం నెలకొంది. నిత్య కైంకర్యాలను అర్చకులు ఆగమ శాస్త్ర ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం, ఆరాధన సేవలు చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించి సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధుల్లో మధ్య ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయం ద్వార బంధనం చేశారు.

క్లుప్తంగా

దారితప్పి మహబూబాబాద్ జిల్లా చేరుకున్న వృద్ధుడు


చంద్రయ్య

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి 75 ఏళ్ల వయసు కలిగిన చంద్రయ్య ఆదివారం దారితప్పి వెళ్లాడు. ఆయన స్వగ్రామం నల్ల గొండ జిల్లా కట్టంగూర్ గ్రామం అని చెబుతున్నాడు. ఇంతదూరం ఎందుకు, ఎలా వచ్చాడనే విషయాన్ని చెప్పలేకపోతున్నాడు. ప్రస్తుతం గుండెపుడిలోని ఊరిపక్క తండా గిరిజన వాసులు చంద్రయ్యకు ఆశ్రయం కల్పించారు.

ఆలయంలో చోరీ

కట్టంగూర్ : మండల కేంద్రం శివారు ఎస్ఎల్‌బీసీ కెనాల్ వద్ద హైవే పక్కనే ఉన్న శివాంజనేయ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నర్సింగోజు భిక్షమాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ఇనుప గేటు, గుడి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి అందులో ఉన్న ఆంప్లీఫయిర్(మైక్‌సెట్), అమ్మవారి పట్టు వస్త్రాలను అపహరించుకుపోయారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని పూజారి పేర్కొన్నాడు. కట్టంగూర్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఆలయ పూజారి తెలిపారు. ఇదే ఆలయంలో గత సంవత్సరం రెండుమార్లు చోరీ జరిగినా నేటికీ దొంగిలించబడిన వస్తువులను పోలీసులు రికవరీ చేయకపోవడం గమనార్హం.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోదాడరూరల్ : పట్టణ శివారులో పేకాడుతున్న 12 మందిని ఆదివారం కోదాడ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ ఫ్లెక్లోవర్ సమీపంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.16,110 నగదు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం


ఆఫ్రీన్

నిడమనూరు: నిడమనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాపురంకు చెందిన షేక్ ఆఫ్రీన్(25) అనే మహిళ అదృశ్యమైంది. ఆమె తండ్రి షేక్ మహమూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. వివరాలు.. ధర్మాపురంకు చెందిన షేక్ మహమూద్‌కు ఇద్దరు కూతుళ్లు. కాగా పెద్ద కూతురు అఫ్రఫ్ పెళ్లి కాగా చిన్న కూతురు ఆఫ్రీన్ ఇంటి వద్ద ఉంటోంది. నాలుగు రోజుల క్రితం పెద్ద కూతురు, అల్లుడు ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచి చిన్న కూతురు ఆఫ్రీన్ కనిపించడంలేదని తెలిపారు. ఆచూకీ కోసం ప్రయత్నించినా తెలియకపోవడంతో తండ్రి మహమూద్ ఫిర్యాదు మేరకు ఆదివారం సాయంత్రం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

వలిగొండ మండలంలో..


గోపాల్

వలిగొండ : వ్యక్తి అదృశ్యం అయిన ఘటన వలిగొండ మండలంలోని నాతాళ్లగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన కొమ్మరాజు గోపాల్ (60) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి నిమిత్తం వరి నాట్లు వేయడానికి 15 రోజుల క్రితం నాతాళ్లగూడెం వచ్చి ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీన కుటుంబ సభ్యులు కూలి పనికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న గోపాల్.. అద్దెకు ఉంటున్న ఇంటి యజమానితో తాను స్వగ్రామం వెళుతున్నానని చెప్పి వెళ్లారు. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి గోపాల్ కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికారు. బంధువులకు ఫోన్ చేసినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఆదివారం గోపాల్ కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- 7 తులాల బంగారం, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం


వివరాలు తెలియజేస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్‌గౌడ్

నాగార్జునసాగర్ : మద్యం, ఇతర వ్యసనాలకు అలవాటు పడి జల్సాలు చేసేందుకు డబ్బుల కోసం మహిళల ఒంటిపై గల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువుల దొంగతనాలకు పాల్పడే ముఠాను నాగార్జునసాగర్, హాలియా పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగల నుంచి 7 తులాల బంగారం, యమహా వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు ఆదివారం విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హాలియాకు చెందిన ఓ బాలుడు.. అనుముల మండలం పంగవానికుంటకు చెందిన కుందాల వేణు అనే స్నేహితుడితో కలిసి సెల్‌ఫోన్లు దొంగతనం చేసి ఇబ్రాహీం పేటకు చెందిన గొట్టిముక్కల శ్రీనివాసచారి అనే వ్యక్తికి విక్రయించేవారు. వచ్చిన నగదుతో జల్సాలు చేసేవారు. వీరితో శ్రీనివాసచారి బంగారం దొంగిలించి తెస్తే ఎక్కువ నగదు ఇస్తానని చెప్పడంతో తన స్నేహితుడు వేణుతో కలిసి బాలుడు తన అమ్మమ్మకు చెందిన 5 తులాల బంగారాన్ని అపహరించాడు. శ్రీనివాసచారి దగ్గరకు తీసుకెళ్లి విక్రయించగా రూ.60వేల నగదు ఇచ్చాడు. ఆ డబ్బులతో వారు హైదరాబాద్‌కు పరారయ్యారు. బాలుడికి నాగోల్‌లో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న పెద్దవూర మండలం చింతపల్లితండాకు చెందిన జఠావత్ అంజన్‌కుమార్ వరుసకు మామ కావడంతో అతడితో కలిసి ఎల్‌బీ నగర్‌లో రెండు రోజులు ఓగది అద్దెకు తీసుకుని జల్సాలు చేశారు. అనంతరం హైదరాబాద్‌లో రూం అద్దెకు తీసుకుని అక్కడే జల్సా చేస్తూ గడిపారు. నగదు అయిపోవడంతో చైన్‌స్నాచింగ్ చేసేందుకు అంజన్‌కుమార్ సహాయంతో యమహా వాహనం అద్దెకు తీసుకుని ఈ నెల 4న సరూర్‌నగర్‌కు చెందిన మరో బాలుడితో కలిసి ఇబ్రాహీంపట్నం, మాల్, కొండమల్లేపల్లి మీదుగా నాగార్జునసాగర్‌కు బయలుదేరారు. ఇదే సమయంలో పెద్దవూర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి తన స్వస్థలం హిల్‌కాలనీకి స్కూటీపై వస్తున్న మెట్ల రూప మెడలో గల బంగారు ఆభరణాలను నెహ్రూ పార్కు వద్ద లాక్కుని పరారయ్యాయి. హిల్‌కాలనీ నుంచి హాలియాకు వచ్చి శ్రీనివాసచారికి ఆ ఆభరణాన్ని విక్రయించారు. రూ.20 వేల నగదు రావడంతో నల్లగొండ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. జల్సాలు చేయడంతో నగదు అయిపోయింది. ఇద్దరు మైనర్లు, వేణు, అంజన్‌కుమార్, శ్రీనివాసచారి సాగర్‌లో కలుసుకుంటున్నారనే నమ్మదగిన సమాచారంతో నాగార్జునసాగర్ సీఐ బీసన్న సూచన మేరకు పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. నాగార్జునసాగర్ బస్టాండు సమీపంలో వాహనంతోపాటు ఇద్దరు బాలురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని విచారించగా మిగతా వారి ఆచూకీ చెప్పారు. అనంతరం వారిని కూడా అరెస్ట్ చేయగా నేరాలను ఒప్పుకున్నారు. ఈ కేసు పరిష్కరించడంలో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ ఎస్ఐ సతీష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో విజయపురిటౌన్ ఎస్ఐ సంపత్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

చౌటుప్పల్ : తాను ఉంటున్న ఆశ్రమంలో ఉరివేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని పెద్దకొండూర్ గ్రామంలో గల శ్రీసాయి యాదాద్రి సేవాశ్రమంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాంరెడ్డి(80) కొంతకాలంగా ఆశ్రమంలో ఉంటున్నాడు. రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లో నివాసం ఉండే అతడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఎనిమిది నెలల క్రితం రాంరెడ్డిని ఆశ్రమంలో చేర్పించాడు. అయితే షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్న రాంరెడ్డి పదిహేను రోజుల క్రితం కుమారుడి వద్దకు వెళ్లాడు. అక్కడ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాక ఈ నెల 2న తిరిగి ఆశ్రమానికి చేరుకున్నాడు. రోజువారి మాదిరిగానే తాను ఉంటున్న గదికి వెళ్లిన రాంరెడ్డి.. సీలింగ్‌కు దోవతితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం ఆదివారం ఉదయం సమయంలో ఆశ్రమ పర్యవేక్షకురాలు పద్మ గుర్తించింది. వెంటనే నిర్వాహకులకు సమాచారం అందించింది. దాంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందుతాగి ...

భువనగిరి క్రైమ్ : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూ పంపిణీ విషయంలో రవీందర్‌రెడ్డిని అతడి తల్లి, తమ్ముడు ప్రభాకర్‌రెడ్డి తిట్టి అవమానించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రవీందర్‌రెడ్డి ఆదివారం బావివద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభాకర్‌రెడ్డి భార్య రమ్య ఫోన్ చేయగా మాట సరిగా రాకపోవడంతో అనుమానంలో బావివద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే రవీందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం భువనగిరికి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

వలిగొండ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నరసాయగూడెంలో చోటుచేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాయగూడెంకు చెందిన ఎడవల్లి ముత్యాలు భార్య గతంలో మృతి చెందింది. మనస్తాపంతో ఉన్న ముత్యాలు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స నిర్వహించి ముత్యాలును భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

భువనగిరి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, తాళ్ల నాగరాజు పేర్కొన్నారు. భువనగిరిలోని వెన్నెల కళాశాలలో ఆదివారం ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు వారు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉపకారవేతనాలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా రాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫీజు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యా వ్యవస్థను గాడిన పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల విద్యార్థులకు నోటు బుక్స్, దుస్తులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శివ, కార్యదర్శి లావుడియా రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి మల్లేశం, మాజీ ఉపాధ్యక్షుడు వనం రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు శివాని, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కాసుల నరేష్, ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్, జగన్, కార్తీక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పున్న శైలజకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న శైలజ

దేవరకొండ: పట్టణానికి చెందిన పున్న శైలజ ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ అందించే డాక్టరేట్‌కు ఎంపికైంది. ఆదివారం హైదరాబాద్‌లో ఏషియా ఇంటర్నేషనల్ కల్చ ర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శైలజ డాక్టరేట్ అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. నల్లగొండ జిల్లా నుంచి తాను డాక్టరేట్ అందుకోవడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

సూర్యాపేట మహిళకు..


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న దీపారాణి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన అనంతుల దీపారాణి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గీతం యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి సీఎస్‌ఈ విభాగంలో ప్రొఫెసర్ పివి లక్ష్మి నేతృత్వంలో ఏఐ/ఎంఎల్‌తో అల్జీమర్ రోగ నిర్ధారణపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఈ మేరకు శనివారం బెంగళూరులో గీతం యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన స్నాతకోత్సవంలో వందే భారత్ ట్రైన్ సృష్టికర్త సుధాంశుమణి చేతుల మీదుగా పట్టా అందుకున్నానని దీపారాణి ఆదివారం తెలిపారు. తల్లిదండ్రులు, భర్త డాక్టర్ అనంతుల రవి శేఖర్, పిల్లల సహకారంతో డాక్టరేట్ సాధించానని దీపారాణి పేర్కొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం, విష్వక్సేనారాధన, రక్షాబంధనం, మాంగల్యధారణ పూర్తిగావించారు.

నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు సీజ్

సూర్యాపేటటౌన్ : నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజ్ చేశారు. సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ.. ఆదివారం సూర్యాపేట పట్టణంలో నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 70 కి పైగా ద్విచక్ర వాహనాలను పట్టుకున్నామన్నారు. వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలన్నారు. రవాణా వాహన చట్టం నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో, వాహనం చోరీకి గురైన సమయంలో నంబర్ ప్లేట్ లేకపోవడం వల్ల వాహనాన్ని గుర్తించడం కష్టతరమవుతుందన్నారు. వాహనానికి సంబంధించిన పూర్తి ఆధారాలు, ఇన్సూరెన్స్ ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాన్ని ఇవ్వొద్దన్నారు. వాహనాలకు సైలెన్సర్లను తొలగించి నడపడం నేరమన్నారు. ద్విచక్ర వాహనదారులు నంబర్ ప్లేట్ తీసుకువచ్చి వారి వాహనానికి బిగించిన తర్వాతనే వాహనాన్ని అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు బుచ్చయ్య, రమణారెడ్డి, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, జానకిరాములు, హోంగార్డ్స్ నరేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో నల్లగొండకు మూడో స్థానం


తృతీయ బహుమతి సాధించిన నల్లగొండ జట్టు

- మొదటి స్థానంలో నిలిచిన పాలమూరు జట్టు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి పట్టణంలోని స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా పాలమూరు జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్‌లో నాలుగు జట్లు తలపడగా.. మహబూబ్‌నగర్, నిజామాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు సమీప ప్రత్యర్థి నిజామాబాద్‌పై 1–0 గోల్స్ తేడాతో గెలుపొందింది. రెండో సెమీ ఫైనల్‌లో నల్లగొండ-నిజామాబాద్ జట్లు తలపడగా నిజామాబాద్ ఫైనల్‌కు చేరుకుంది. విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుకు మెడల్స్‌తో పాటు ట్రోఫీని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ ప్రదానం చేశారు. రన్నరప్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టుకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్పీ.వెంకటేశ్ అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన ఖమ్మం, నల్లగొండ క్రీడాకారులు మెడల్స్‌తో పాటు ట్రోఫీలు అందుకున్నారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుకిరణ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్య, కల్వకుర్తి ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు రాజేందర్, విజయ భాస్కర్, చంద్ర జైపాల్ తదిరులు పాల్గొన్నారు.

‘గుట్ట’లో జగన్నాథ రథయాత్ర


యాదగిరిగుట్టలో జగన్నాథుడి రథాన్ని లాగుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం కూకట్‌పల్లి ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పూరీ జగన్నాథ రథయాత్రను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. రథానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టారు. అనంతరం శ్రీ జగన్నాథుడు అధిష్టించిన రథాన్ని వైకుంఠ ద్వారం నుంచి పట్టణంలోని బస్టాండ్ వరకు లాగుతూ ఊరేగింపుగా వచ్చారు. ఈ వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు, ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే పద్మావతి


హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ వేడుకల్లో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి పాల్గొని బోనం ఎత్తుకున్నారు. - కోదాడ

పంట మార్పిడితో అధిక దిగుబడి

- ఒకే రకం పంట సాగుతో తగ్గుతున్న భూసారం
- చీడపీడల వృద్ధిని నిరోధించేందుకు దోహదం


జీలుగు పంట వేసిన రైతు


దంతాల దివ్య, మండల వ్యవసాధికారిణి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులంతా వ్యవసాయ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేస్తున్నందుకు భూమిలో సారం తగ్గి క్రిమికీటకాలు వృద్ధి చెంది పంటలు దిగుబడి తగ్గడంతోపాటు పెట్టుబడి సాయం ఎక్కువ అవుతోంది. పంటల మార్పిడి విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధించి, అధిక ఆదాయం పొందవచ్చని అంటున్నారు. ఆత్మకూర్(ఎస్) మండల వ్యవసాయ అధికారి దంతాల దివ్య. పంట మార్పిడితో మొక్కలకు పోషకాలు సమృద్ధిగా అంది దిగుబడి పెరుగుతుందని అంటున్నారు. అధిక దిగుబడికి రైతులు పాటించాల్సిన మెళకువలు ఆమె మాటల్లోనే..

ఒకే రకం సాగుతో నష్టాలు

ఒక వ్యవసాయ భూమిలో ఒకే రకమైన పంట వరుసగా సాగు చేయడం వల్ల చీడపీడల వృద్ధి అధికమవుతుంది. పంట మార్పిడి చేస్తే ఒక పంటపై ఆశించే పురుగు మరో పంటను ఆశించదు. దీంతో పురుగుల ఉధృతి తగ్గి పంట దిగుబడి పెరుగుతుంది. వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడితో అదుపులో పెట్టొచ్చు. వరి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు నేలపై పోషకాలు తీసుకుంటాయి. దీంతో నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండేందుకు చీడపీడల అభివృద్ధిని నిరోధించేందుకు పంట మార్పిడి తప్పకుండా చేయాలి.

పంటల సాగు చేయాల్సిన విధానం

పాడి పంట

- వరి తరువాత పొలంలో మినుములు, పెసర, వేరుశనగ సాగు చేస్తే సుడిదోమ, లుంబో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి వేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నిర్మూలించవచ్చు.
- వరి సాగు చేసే పొలంలో ముందుగా పప్పు ధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతమవుతుంది.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగలో ఆకు ముడత నివారించేందుకు పప్పు జాతికి చెందిన పైర్లు వేసుకోవాలి.
- మిరప పంటలో ఎండు తెగులు నివారణకు మొక్కజొన్న సాగు చేయాలి.
- నులిపురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, వంగ సాగు చేయడంతో నివారించవచ్చు.
- ఆహార, వాణిజ్య పంటలు వేసే ముందు పిల్లి పెసర, జనుము, జీలుగులాంటి పంటలు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారిణి దంతాల దివ్య అన్నారు.